మొత్తంపై పాకిస్థాన్‌లో ముస్లింలీగ్ ముష్కర పరిపాలనకు ఇంకా రోజులు వున్నట్లే కనిపిస్తున్నది. ఇటీవల ప్రతి పక్షశక్తులు బలపడినట్లే బలపడి, మళ్ళీ క్రమక్రమంగా క్షీణించి పోతున్నవి. మిస్టర్ హక్ ఈ విధంగా నమ్మక ద్రోహం చేయగా యునైటెడ్ ఫ్రంట్‌లో మరొక ప్రముఖనాయకుడు మిస్టర్ సుహ్రావర్ది ఆరోగ్యం నానాటికీ క్షీణించి పోతున్నది. తూర్పు బెంగాల్ పరిస్థితి యిలావుండగా పశ్చిమ పంజాబ్‌లో ప్రతి పక్షనాయకుడైన మామ్‌దోత్ నవాబ్‌కు గవర్నర్ పదవి ఆశ పెట్టి ఆయనను వశం చేసుకున్నారు. సింధు రాష్ట్రంలో కాజీ అబ్దుల్ మున్నన్‌కు తిరిగి మంత్రిపదవి యిచ్చి, "బుట్ట"లో వేసుకున్నారు. ఫీర్ ఆలీమహమ్మద్ రషీద్, పీర్ పగార్ మున్నగువాడు ప్రభుత్వధాటికి తట్టుకోలేక విదేశయాత్రకు వెళ్ళారు. పోతే, ఇక సరిహద్దు రాష్ట్రంవున్నది. అక్కడ ఖాన్ సోదరులనుకూడా ఏదోవిధంగా వశం చేసుకోవాలని ముస్లింలీగ్ యత్నిస్తున్నది. ఈ సందర్భంలో ముస్లింలీగ్‌తో రాజీకి "సరిహద్దుగాంధీ" ఒక్కడే అంగీకరించడంలేదని. ఆయన సోదరుడు డాక్టర్ ఖాన్ సాహెబ్ కూడా రాజీకి సుముఖంగా వున్నాడని, "సరిహద్దుగాంధీ" కుమారులు కూడా ఈయనతోనే ఏకీభవిస్తున్నారని ఇటీవల వదంతులు వ్యాపించినవి. ఇక, బెలూచిస్థాన్‌లో "బెలూచి గాంధీ" ఖాన్ అబ్దుల్ సమద్ ఖాన్ తన స్వగ్రామందాటి వెళ్ళరాదని నిర్బంధాజ్ఞ విధించబడింది. ఈ విధంగా పాకిస్థాన్‌లో అన్ని రాష్ట్రాలలో కూడా ప్రతి పక్షశక్తులు ఏదోవిధంగా నీళ్లు కారి పోతున్నవి.

ఈ సమయంలో "సరిహద్దుగాంధీ," ఆజాద్ పాకిస్థాన్ పార్టీ నాయకుడు మియాన్ ఇఫ్తికారుద్దీన్, తూర్పుపాకిస్థాన్ అవామీలీగ్ నాయకుడు మౌలానా భషానీ, సింధులో మిస్టర్ జి. ఎమ్. సయ్యద్ ప్రభృతులే ధైర్యంగా నిలబడి ప్రతిపక్ష శక్తులకు నాయకత్వం వహించ వలసివున్నది. ముఖ్యంగా "సరిహద్దుగాంధీ"పై ప్రధానబాధ్యత వున్నది.

మిస్టర్ హక్ వంటి "ఊసరవెల్లి" రాజకీయ వేత్తలను నమ్ముకొన్నందువల్ల ఏమీ ప్రయోజనం లేదు. "మిస్టర్ హక్ పాకిస్థాన్‌లోని ప్రగతిశక్తులకు ప్రతినిధిగా నిలవనున్నాడో లేక ప్రతీప శక్తులకు ఇదివరలోవలెనే లొంగిపోనున్నాడో కాలమే సమాధానం చెప్పగలదు" అని ఈ రచయిత ఇదివరలో వ్రాయడం జరిగింది. రెండునెలలు తిరగకుండా సమాధానం చెప్పినందుకు "కాలాన్ని" కూడా అభినందించవలసిందే మరి.

---

స్కెచ్

# కొత్త బల్ల

విశ్వమిత్ర

బల్లమీద చిందర వందరగా పారేసివున్న పుస్తకాల్నీ, కాయితాల్నీ తీసి జాగ్రత్తచేసి, బల్లని శుభ్రంగా దులిపి ఓ ఇస్త్రీ టేబుల్ క్లాత్‌ని, తను ప్రత్యేకంగా దానికోసం రంగుదారాలతో కుట్టిన పువ్వులు కనపడేట్టు బల్ల అంచులు కిందకి బాగా జారేట్టువేసి, అందమైన "ఫ్లవర్ వాజ్" లోనుంచి, వాసనా రంగూవుండే పూలని పేర్చి, కమల, వెంకటేశాన్ని ఎలావుందో చూడమని గదిలోంచి పిలుచుకొచ్చింది. వెంకటేశం అది చూసి మూర్ఛ పడిపోతాడేమోనని అనుమానించినట్టు కమల, ఆ బల్లవంక వింతగా చూస్తున్న వెంకటేశం వీపునకు తన కుడిచెయ్యి పోటీ పెట్టింది.

ఆశ్చర్యాన్ని జీవితంలో మొదటిసారిగా పొందే వాడిలా మొహంపెట్టి వెంకటేశం,

"బావుంది!" అని మాత్రం అనగలిగేడు.

"ఇంకా నయం!" అనుకుంది కమల. వెంకటేశం, పడ్డ ఆశ్చర్యానికి. అంతకంటే ఎక్కువ

మెప్పొందలని ఆశించిన కమలకి "బావుంది" అన్న వెంకటేశం మాటలు, నాలుగోవంతు తృప్తిని కూడా ఇవ్వలేక పోయినయ్.

కమల అసంతృప్తిని చూసి, వెంకటేశం పోనీలే అన్నట్టు,

"చాలా బావుంది!" అన్నడు. ఐతే ఈసారి అనటంలో మొహంలోవున్న మొదటి ఆశ్చర్యం క్రమంగా తగ్గిపోవటంవల్ల గావుల్ను, మాటలకి తగ్గ ఫోర్సు మొహంలో కనబళ్ళేదు. ఇంతకంటే మొదటి, ఆశ్చర్యంతో "బావుంది" అన్న రిమార్కే కమలకి ఎక్కువతృప్తి నివ్వగలిగింది. వెంటనే కమలకి ఒక్కసారి ఒళ్లు మండింది. వెంకటేశం తత్త్వంచూసి వెంకటేశానికి మెచ్చుకోవటం చాతకాకగాదు తన్ను మెచ్చుకోంది. మెచ్చుకో దలుచుకోకే.

అంత దాకా ఆ "బల్ల"కి రెండు గజాల దూరంలోవున్న వెంకటేశం, బల్లకి దగ్గిరిగావొచ్చి కమల అల్లిన రంగుదారాల పూలని చేత్తో తాకుతూ, ఒకచోట వేలుపెట్టి,

"ఇదేం పువ్వు?" అని అడిగాడు.

అందంకోసం గులాబి పువ్వుకి ఊదారంగు దారాన్ని కుట్టిన కమల వెంకటేశం, అలా అడగటం, తనని కావాలని ఏడిపించడం అని తెలుసుకోని,

"ఊదారంగు రేకలుండే గులాబిపువ్వు!"అని చెప్పింది.

వెంకటేశానికి నవ్వొచ్చింది. ఒకసారి హాలంతా కలయచూచాడు. అర్థంకాక కమల ఆశ్చర్యంగా చూస్తోంది.

"బాగానే వుందిగానీ, అసలు ఈ బల్లని ఇక్కడ కంటే, నా గదిలో పెడితే బావుంటుం దేమో!" అన్నాడు. వెంకటేశం - ఎంతోసేపు ఆలోచించి.

అసలే కోపంతోవున్న కమలకి వెంకటేశం ఈ మాటలు అనేటప్పటికి మరింత కోపంవొచ్చింది. పోనీ కనీసం కాసేపు పొగిడింతర్వాతైనా అలా అంటే కమలకి అంత బాధగా వుండేదికాదు.

వెంటనే జవాబు చెప్పింది.

"బావుండదు!" అని.

కమల మరీ అంత నిర్మొహమాటంగా చెప్పటం వెంకటేశానికి,ముల్లుతో పొడిచినట్టయింది.

"సగం హాలుని ఇదే ఆక్రమించుకుంది. పైగా ఇక్కడ దీని వుపయోగమూ సున్న!" కమల మొహం చూడకుండావుంటే వెంకటేశం ఇంకా కాసేపు అలాగే మాట్లాడాడు. జడని ముందరకి వేసుకొని వేలుకు చుట్టుకొంటూ కమల వెంకటేశాన్ని మింగేసేట్టు చూస్తోంది.

"మీ గదిలోవున్న రెండు కుర్చీల్లో ఒకటి తెచ్చి ఇక్కడ పడేస్తే శుభ్రంగా వుపయోగ పడుతుంది. ఇదేనుడ్డం - ఎవరైనా ఇంటికొచ్చినా ఏమీలేకుండా అసహ్యంగా"...కమల కోపంతో ఇంక మాట్లాళ్ళేకపోయింది.

నిజానికి వెంకటేశానికి ఆ బల్ల పెద్ద అవసరం కాకపోయినా, అందంగా, సద్దిన ఆ బల్లనిచూసి అది తనగదిలో పెట్టుకోవాలనిపించింది.

కమల కోపానికి కూడా అదే కారణం. ఇన్నాళ్ళనుంచి చిందర వందరగా సామాన్లన్నీ పడేసిన ఆ బల్లతో లేనిఅవసరం, అది యివ్వాళ కంటికి శుభ్రంగా కనిపించగానే వొచ్చిందా? పోనీ ఆ మాటని ముందరగానే చెప్పి, తనని కొంచెం పొగిడితే ఇచ్చేదే. అలాకాక, అది హాల్లో వుండటమే ఓ పెద్ద అడ్డమైనట్టూ. దాన్ని తను గదిలో పెట్టుకోటానికి ఇష్టం లేకపోయినా ఒప్పుకొన్నట్టూ చేసిన నటనని చూసి, కమలకి కోపం వొచ్చింది.

ఆ తర్వాత వెంకటేశానికీ కమలకీ, ఆ బల్లని గురించితీవ్రమైన అభిప్రాయభేధాలు వచ్చినాయ్.

కమలకి, అది వాళ్ళ పుట్టింటివాళ్ళు ఇచ్చింది. అందుకని దానిమీద ప్రత్యేకంగా తనకి కొన్ని హక్కులు వున్నయని కమలవాదం. పైగా అక్కణ్ణించి అది తీస్తే హాలంతా చిన్నబోతుం దనీ, ముఖ్యంగా తన ఎంబ్రాయిడరీపని, రోజూ వాళ్ళింటికొచ్చేవాళ్ళకి కనపడదనీ కమలవుద్దేశం.

చివరికి కమలేగెలిచింది. అంటే ఆ బల్లని అక్కణ్ణించి కదిలించకుండా వుండగలిగింది. వెంకటేశం లోపల ఏమనుకొన్నాడో గానీ, బైటికి మాత్రం ఏమీ అన్లేదు. రెండు మూడు సార్లు ఆ బల్లవంకమాత్రం పరీక్షగా చూశాడు.

వెధవ బల్లమీద ఇంత తీవ్రంగా వాదించుకోవటం వాళ్ళిద్దర్లో ఎవ్వరికీ ఇష్టంలేదు. కానీ చివరికి పోనీ ఇచ్చేద్దామా అని కమల అనుకొనే వేళకి వెంకటేశమే అక్కడే వుండనియ్యమన్నాడు. వెంకటేశం మనసు కష్టపెట్టుకోవటం కమలకి అసలు ఇష్టంలేదు. కానీ వెంకటేశం అలా కనిపించలేదు. మామూలుగానే వున్నట్టు వున్నాడు.

తర్వాత వెంకటేశం భోజనంచేసి ఆఫీసుకు వెళ్ళిపోయ్యాడు. చాలాసేపు కమలకి ఏం తోచలేదు. ఆ బల్లనిగురించిన ఆలోచన్లే. ఎందుకు సర్దేనా? అనుకొంది. కాసేపు ఏదో ఎంబ్రాయిడరీ పని చూచుకొంది. ఇంకా కాసేపు ఏదో చదివింది ... ఎంతసేపు ఏ పనిచేసినా, ఆ బల్లని వెంకటేశం అడుగుతున్నట్టే అనిపించేది.

అకస్మాత్తుగా కమలకి ఓ ఆలోచన తట్టింది. వెంకటేశం,ఆ బల్లని తనఎదుటపొగడకపోయినా, అది అంత బావుటంవల్లేగదా, తన గదిలో పెట్టుకోవాలనుకోవటం? లోపల తనని తప్పకుండా పొగిడి వుంటాడనుకొంది కమల. కనక ఈ బల్లని వెంకటేశం అడిగినట్టు, ఆ గదిలో వుంచితే. తన గొప్పతనం మరీ స్పష్టంగా తెలుస్తుంది వెంకటేశానికి. అప్పుడు తనని పొగడక తప్పదు. అంతగా తను కావాలనుకొంటే రెండు రోజులు పోయింతర్వాత ఎలాగూ వెంకటేశానికి దానిమీద మోజు తగ్గుతుంది కనుక, మళ్ళీ హాల్లో పెట్టుకోవొచ్చు అనుకుని కమల ఎంతో అవస్థపడి తను ఒక్కతీ ఆ బల్లని వెంకటేశం గదిలోకి చేర్చింది. ఈసారి ఇందాకటి కంటే కూడా బాగా అలంకరించి సాంబ్రాణి వత్తులుకూడా వెలిగించి పెట్టింది. ఇదంతా చేసేటప్పటికీ మధ్యాహ్నం మూడయింది. తను నీటుగా తయారయి, వెంకటేశం రాక కోసం ఎదురు చూస్తూ కూర్చుంది కమల. ఈసారి వెంకటేశం తనని మెచ్చుకోక తప్పదు! సంతోషంతో ఆ రెండు గంటలూ ఇట్టే గడిపేసింది కమల.

సాయంత్రమైయింది. రోజూకంటే ఓ గంట లేటుగావొచ్చాడు వెంకటేశం. నవ్వుముఖంతో వున్న కమలనిచూసి వెంకటేశంకూడా నవ్వాడు. వెంకటేశంలోవున్న సంతోషానికి కారణం తెలియక పోయినా, కమల అతని సంతోషాన్ని తనదిగా చేసుకోబోతున్నందుకు హృదయపూర్వకంగా నవ్వింది.

వెంకటేశం తనగది తలుపు తీశాడు. వెనకనే కమల వుంది.

“ఇదేమిటి కమలా? - దీన్ని - హాల్లోనే వుండనియ్, ఇది హాల్లోవుంటేనే బావుంటుంది.” అన్నాడు. వెంకటేశం మాటలకి కమల ఒక్కక్షణం తెల్లబోయినా, తనలోవొచ్చిన మార్పులాంటి మార్పే అతనిలోనూ వొచ్చిందనుకొని, తను రెండు రోజుల తర్వాత జరగగలదాన్ని వూహించినది ఇప్పుడే జరుగుతున్నందుకు సంతోషించి, ఐనా మొహమాటం కొద్దీ,

“కాదు - వుండనియ్యండి!” అంది.

కాని వెంకటేశం బలవంతంగా తనూ, కమలా కలిసి, ఆ బల్లని కాళీ హాల్లోకి చేర్చిందాకా వూరుకోలేదు. వెంకటేశం ప్రవర్తనకి కమల చాలా సంతోషించింది. వెంకటేశంకూడా సంతోషించాడు, ఇదంతా రెండు రోజుల్లో జరుగుతుందని వూహించిన కమలకి వెంకటేశం ఇంటికొచ్చిన ఐదునిముషాల్లో జరిగిపోవటం సంతోష కారణమే ఐనా ఎక్కడో, ఏదో అసంతృప్తి బాధిస్తూనే వుంది.

మళ్ళీ హాల్లోకి మార్చిన బల్లని సద్దుతుండగా కమలకి,

“ఇటు ... ఇటు ..., ఇటుతీసుకురా” అన్న మాటలు వినిపించి బైటికొచ్చి చూసింది.

వెంకటేశం, కొత్తబల్ల నొకదాన్ని తీసుకొచ్చిన కూలివాడికి తనగదికి దోవ చూపిస్తున్నాడు.

జడ ముందరికేసుకొని వేలికి చుట్టుకొంటూ కోపంగా చూసింది వెంకటేశం కేసి కమల.

వెంకటేశం నవ్వాడు-

---

విమర్శకుల విమర్శలను అంతగా లెక్కచేయనక్కరలేదు. విమర్శకుని గౌరవార్థం ఎక్కడా శిలావిగ్రహాలు ప్రతిష్ఠింపబడడం యింతవరకూ జరగలేదు.—సిబెలియస్.